సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



పత్రికనగర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని పత్రికనగర్ కాలనీలో రూ.28 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 64 సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించారు. కెమెరాల ఏర్పాటుతో కేసుల పరిష్కారం సులువు అని తెలిపారు. అన్ని కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ఫండ్ ద్వారా 1 కోటి రూపాయలను కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఇక్బాల్, పత్రికనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు సుధాకర్, చంద్రకాంత్‌రావు, నాగేశ్వర్ రావు, రవికుమార్, నారాయణ, పద్మజ, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, రమేష్‌రెడ్డి, రామకోటయ్య, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రియేటివ్ స్క్వేర్‌లో చిన్నారుల సందడి



ఖాజాగూడలోని క్రియేటివ్ స్క్వేర్‌లో చిన్నారుల సందడి

రాయదుర్గం: ప్రస్తుత స్క్రీన్‌లు, డిజిటల్ కంటెంట్ యుగంలో పిల్లలు ఆరోగ్యకరమైన వ్యక్తిత్వ నిర్మాణం ఎంతైనా అవసరమని ప్రముఖ చైల్డ్ సైకాలజిస్ట్ శ్రీదేవిప్రసాద్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో పిల్లల ఆరోగ్యకరమైన వ్యక్తిత్వ నిర్మాణానికి సరదాగా ఆట ఆధారిత అభ్యాస ప్రాంతం 'క్రియేటివ్ స్క్వేర్'ను శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చాలా మంది పిల్లలు వ్యక్తిత్వంలో, ఎదుగుదల, ఆరోగ్య రుగ్మతలలో చాలా తేడాలు కనిపిస్తున్నాయన్నారు. పిల్లల కోసం శంకర్ ఫౌండేషన్ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రస్తుతం పిల్లలు ఎలక్ట్రానిక్ స్క్రీన్(మొబైల్‌ఫోన్స్) చూస్తూనే ఉండటం, ఏపని చేయాలన్నా బద్ధకంగా ఉండడం కనిపిస్తోందన్నారు. దీన్ని తల్లిదండ్రులు సాధ్యమైనంత వరకు తగ్గించేలా చూడాలన్నారు. పిల్లల అభ్యాసన సామర్థ్యాలతో సంబంధం లేకుండా పిల్లల మొత్తం అభివృద్ధి కోసం విభిన్న భావనలను న్యూరో డైవర్జెంట్ ఉపయోగించే కార్యక్రమాలను ప్రస్తుతం అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

హాస్యవల్లరి.. నృత్య ప్రదర్శనలు

శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం హాస్యవల్లరి, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలను ప్రదర్శించారు. శ్రీరాగ రమ్య సోషల్ అండ్ కల్చరల్ సంస్థ రమ్య ఆధ్వర్యంలో సరాగాలు సిరి నృత్య హాస్యవల్లరి కార్యక్రమాన్ని నిర్వహించారు. హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర్ నారాయణ హాస్యవల్లరి సందర్శకులను ఆకట్టుకుంది. రశ్మిత, అనిల్‌కుమార్ , ప్రశాంతి, జయశ్రీ శిష్యబృందం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. ఇందులో మహాగణపతిం, శ్లోకాలు, రామదాసు కీర్తనలు, అన్నమాచార్య కీర్తన, బృందావన తిల్లాన, గణేశకౌతం, మూషికవాహన తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

పాఠశాలలో ఉచిత దంత వైద్యశిబిరం

రాయదుర్గం: సమాజ సేవలోముందుంటామని ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ పాఠశాల విద్యార్థిని నిరూపిస్తోంది. శనివారం గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లితండాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఓక్రిడ్జ్ పాఠశాల విద్యార్థిని జగతికొమ్మి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. నగరంలోని స్ప్రింట్ దయాగ్నొస్టిక్ స్ప్రింట్ డెంటల్ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంతాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థిని జగతి మాట్లాడుతూ విద్యార్థులు దంతాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు.

నృత్యార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం భ్రమరీ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నృత్యార్చన నిర్వహించింది. డాక్టర్ శోభరాజు విద్యార్థులు శ్రీ విష్ణుసహస్రనామస్తోత్రమ్, శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రమ్‌లతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అకాడమీ గురువు సునీత దివాకరుని శిష్యబృందం వరేణ్య, వేదాంన్ష, శ్రీద్ధ, శ్రీనిధి, రుషిక, చార్వి, పర్ణిత, ప్రణవి, ఆరోహి, పుష్పలు కూచిపూడి ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. ఇందులో మూషికవాహన, తిరుతిరు, డోలయాంచల, దశావతారశబ్దం తదితర అంశాలను ప్రదర్శించారు.

స్థానిక యాసల కోసం 'స్వేచ్ఛ గొంతుక'



పాట పాడుతున్న గాయకుడు రామ్ మిరియాల

గచ్చిబౌలి: తెలుగు భాషలో కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు మనుషుల్లా మాట్లాడేలా శిక్షణ ఇచ్చే కార్యక్రమమే 'స్వేచ్ఛ గొంతుక' ప్రాజెక్ట్ అని నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'స్వేచ్ఛ గొంతుక' ప్రాజెక్టను గాయకుడు రామ్ మిరియాల ప్రారంభించారు. స్వేచ్ఛ తెలంగాణ ఆధ్వర్యంలో తెలుగు భాషలోని స్థానిక యాసలను సంగ్రహించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టను రూపొందించారు. ఫిబ్రవరి చివరి నాటికి పది వేల గంటల వాయిస్ డేటాను సేకరించే లక్ష్యంతో పని చేస్తోంది. మొట్టమొదటి సారిగా తెలుగు ఆపరేటింగ్ సిస్టమ్, ఏఐ చందమామ కథలను రూపొందించింది. ఏఐ తెలుగు కచేరీ నిర్వహించారు. గాయకుడు, స్వరకర్త రామ్ మిరియాల తన పాటలతో యువతను ఉర్రూతలూగించారు.

షార్ట్ ఫిల్మ్ అవార్డులు

- తెలుగు రాష్ట్రాల్లో 21 కేటగిరీలలో అవార్డులు
- టీహబ్ ప్రాంగణంలో సందడి

రాయదుర్గం: తెలుగు షార్ట్ ఫిల్మ్ అవార్డులు-2023 కార్యక్రమంలో సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన షార్ట్ ఫిల్మ్ మేకర్స్‌కు అవార్డులను ప్రదానం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో టీఎస్ఎఫ్ఏ, కళారాజ్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ పర్యవేక్షణలో డిజిటల్ అవార్డులు-2023లను 21 కేటగిరిలలో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతి వెలిగించి ప్రముఖ జోతిష్యులు వేణుస్వామి ప్రారంభించారు. అనంతరం వేణుస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం సోషల్ మీడియాకు క్రేజ్ పెరిగిందన్నారు. ఎంటర్‌టైన్ మెంట్, కామెడీ, టాలెంట్ వంటి రంగాలలో స్టోరీ మేకింగ్ అంశంలో యూట్యూబ్, ఇన్‌స్టా ఫ్లాట్‌ఫామ్‌లో నేటి యువత స్టార్స్‌గా ఎదగడంతోపాటు స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో కళారాజ్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత శ్రీనివాస మర్రి ,టీఎస్ఎఫ్ఏ ప్రతినిధులు, షార్ట్ ఫిల్మ్ అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాలు

- మాదాపూర్ ఏరియాలో నిత్యం ట్రాఫిక్ జామ్
- పనికిరాని వాహనాలు సైతం రోడ్ల పక్కనే
- భవన నిర్మాణ సామగ్రి, వ్యర్థాలు రోడ్డుపైనే
- ఉద్యోగులు, పాదచారుల వెతలు



మాదాపూర్‌లోని చందానాయక్‌తండా, సర్వే ఆఫ్ ఇండియా ప్రాంతాలలో రోడ్లపై అస్తవ్యస్తంగా పార్క్ చేసిన వాహనాలు

మాదాపూర్: మాదాపూర్ ఐటీ ప్రాంతం కావడంతో రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. నిత్యం ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. దీనికితోడు మాదాపూర్ ప్రాంతంలో రోడ్లపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ అస్తవ్యస్తంగా నిలుపుతున్నారు. మాదాపూర్‌లోని చంద్రనాయక్ తండా, అయ్యప్పసొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా, సాయినగర్ తదితర ప్రాంతాలలో రోడ్లపై వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతుండడంతో కార్యాలయాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఐటీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రధాన రోడ్లపై బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నా పార్కింగ్‌కు స్థలం వదలక పోవడంతో వచ్చిన వారు రోడ్లపై పెడుతున్నారు.
- ఈ ప్రాంతంలో సెకండ్ హ్యాండ్ కార్ల స్టోర్‌లు ఎక్కువగా ఉండడంతో పాడైన వాహనాలను రోడ్ల పక్కన పెడుతున్నారు.
- కొంతమంది రైల్వే స్టేషన్‌కు, బస్టాప్‌లకు వెళ్ళి పనులయ్యాక రాత్రికి వచ్చి తీసుకు వెళుతున్నారు.
- ఇలా రోడ్లపై పెట్టిన వాహనాలను ట్రాఫిక్ అధికారులు పట్టించుకుపోవడంతో ఇది మరింత జఠిలంగా మారింది.
- అంబులెన్స్‌లు సైతం వెళ్లడానికి వీలు లేకపోవడంతో వెనుదిరిగి పోయిన సందర్భాలు ఉన్నాయన్నారు.
- ఇక మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఎక్కువగా భవన నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఐరన్, ఇటుక, ఇసుక, సిమెంట్‌లను రోడ్లపై ఉంచడంతో రోడ్లు కుంచించుకుపోతున్నాయని, రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు.
- జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు.



రోడ్లపై వాహనాలు నిలపడంతో ఇబ్బందులుపడుతున్న వాహనదారులు



అయ్యప్పసొసైటీ, చందానాయక్‌తండాలో రోడ్లపై ఇసుక ,ఐరన్, ఇటుకలు



కూరగాయల ధరలు



శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 60, బెండ 60, కాకర 60, దొండ 50, దోస 30, ఆలు 25, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 50, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 350.

తైలాభిషేకం

రాయదుర్గం: అర్చకుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య శనిదేవునికి తైలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి దర్శనం కల్పించారు. అలాగే గణపతి, కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, ధన్వంతరి స్వామి, ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

బిస్కెట్లు, కేక్ పంపిణీ



కేక్ కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాయకులు

రాయదుర్గం: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా శనివారం ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పండ్లు, బిస్కెట్లు, కేక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు జంగయ్యయాదవ్, నరేష్, రమేష్‌గౌడ్, గోవింద్, రవి, శ్రీనివాస్,సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ మెగా రిటైల్ ఎక్స్‌పో



సాక్షి, సిటీబ్యూరో: కెనరా బ్యాంక్ మెగా రిటైల్ ఎక్స్‌పో ప్రారంభమైంది. హైటెక్ సిటీలోని మేడాన్ ఎక్స్‌పో సెంటర్‌లో శనివారం భారత మాజీ క్రికెటర్ శ్రీ వెంకటేష్ ప్రసాద్ ఈ ఎక్స్‌పోను ప్రారంభించారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఎక్స్‌పోలో సుమారు 40 మంది బిల్డర్లు, వాహన డీలర్లు తమ ప్రాపర్టీ స్టాల్స్/ ప్రొడక్ట్ ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేసి హౌసింగ్‌లోన్ , వాహన రుణాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో ప్రభుత్వ భూములను కాపాడాలి

కలెక్టర్ శశాంక్‌కు కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌గౌడ్ వినతి



జిల్లా కలెక్టర్ శశాంక్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్‌ను శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి వినతిపత్రాన్ని అందజేశారు. శేరిలింగంపల్లిలో ప్రభుత్వ భూములు కబ్జాలు, అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన అవసరం ఉందని, ఇక్కడి భూములకు విపరీతమైన విలువ పెరగడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



డీఈఓ సుశీందర్‌రావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు

శేరిలింగంపల్లి: ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షలపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృథా చేయకుండా ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. మానసికశాస్త్ర నిపుణులు లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు సరైన ఆలోచన, నిర్ణయం, పని, సాధన ద్వారా లక్ష్యాన్ని అవలీలగా చేరుకోవచ్చన్నారు. అవగాహన సదస్సు నిర్వహణకు సహకరించిన టీపీసీసీ రాష్ట్ర నాయకులు జెరిపేటి జైపాల్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బసవలింగం, రాములు, తాజ్‌బాబు, పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు, శ్రీనివాస్‌రెడ్డి, టీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బలవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను.. స్పెషల్ డ్రైవ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరు సకాలంలో ఇంటి పన్ను కట్టి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి కోరారు.శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలలో ఇంటి పన్నును చెల్లించని వారు వెంటనే చెల్లించాలని సూచించారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పటాన్‌చెరు ఎంవీఐగా విజయరావు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజా మహ్మద్ కోదాడకు బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ఆర్టీఓ కార్యాలయం నుంచి బదిలీపై విజయరావు రానున్నారు.

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు

ఆల్విన్‌కాలనీ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా శనివారం వివేకానందనగర్‌లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నివాసంలో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, కార్పొరేటర్ రోజాదేవి, దొడ్లవెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా కె.వెంకారెడ్డి



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల తహసీల్దార్‌గా కె.వెంకారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయంలోని రికార్డ్, బీ సెక్షన్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ల విభాగాలను పరిశీలించారు. రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ వెంకారెడ్డికి కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ శంకర్, సర్వేయర్ మహేష్, ఆర్ఐలు శ్రీను, రాంబాబు శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర వివరాలు అందించాలి..

శేరిలింగంపల్లి మండలానికి సంబంధించిన సమగ్ర వివరాలను వెంటనే అందించాలని తహసీల్దార్ కె.వెంకారెడ్డి ఆదేశించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకారెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో ప్రభుత్వ భూముల వివరాలు, జిల్లా కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టులలో ఉన్న కేసులకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఆర్ఐలు రాంబాబు, శ్రీను, మండల సర్వేయర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

25న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

హఫీజ్‌పేట్ : మియాపూర్ గాయత్రీ బ్రాహ్మణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25 తేదీన 13వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను మియాపూర్ జనప్రియ అపార్టుమెంట్స్‌లోని షిర్డి సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి మూర్తి శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ వేదికలో పాల్గొనదలచిన వారు ముందస్తు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9948321233, 7981413159లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అశ్వవాహనంపై ఆదినారాయణస్వామి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత ఆదినారాయణస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ రామాజీరావు, మాజీ సర్పంచ్ శివరాజ్‌ల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై స్వామివారిని ఊరేగించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిన్నారం తహసీల్దార్ భిక్షపతి హెచ్చరించారు. జిన్నారం మండలంలోని బొల్లారం, ఖాజీపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ, శిఖం భూములను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, శిఖం భూములను రక్షించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఎవరైన ప్రభుత్వ భూముల జోలికి వస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ ఉన్నారు.

ఇంటికే సమ్మక్క, సారలమ్మ ప్రసాదం..

రాయదుర్గం: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా అమ్మవారి ప్రసాదాన్ని ఇంటికి చేర్చేందుకు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపోలాజిస్టిక్ సేవా విభాగం ఏర్పాటు చేసింది. డిపో మేనేజర్ ఎంఎంరెడ్డి, డిపో లాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పివిరెడ్డి ఆధ్వర్యంలో భక్తుల ఇంటికి ప్రసాదాన్ని చేర్చేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూ డిపో లాజిస్టిక్ సేవా విభాగం ఆధ్వర్యంలో 16వ తేదీన ప్రారంభించిన ఈ సౌకర్యం ఈనెల 25వ తేదీ వరకు ఉంటుంది. ప్రసాదం కోసం ఒక ప్యాకెట్‌కు రూ.299 డిపో పరిధిలోని లాజిస్టిక్ కౌంటర్లలో మార్కెటింగ్ ఏజెంట్ల వద్ద బుకింగ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసి బుక్ చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. వివరాలకు పివి రెడ్డి- 9652267204,9849567204,7382806563లో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌సీయూ విద్యార్థుల ముందస్తు అరెస్ట్

గచ్చిబౌలి: చలో జన్వాడకు పిలుపునిచ్చిన 15 మంది హెచ్‌సీయూ విద్యార్థులను ముందస్తుగా గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే జన్వాడలో 144 సెక్షన్ విధిస్తున్నట్లు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఓ వర్గానికి మద్దతుగా హెచ్‌సీయూ విద్యార్థులు చలో జన్వాడకు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు విద్యార్థులను ముందస్తుగా అరెస్ట్ చేశారు.

డీఎస్‌యూ వినతి..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో దళిత్ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) నాయకులను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తదనంతరం వారు డీసీపీ, సీఐకి జన్వాడ ఘటనపై బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో డీఎస్‌యూ హెచ్‌సీయూ అధ్యక్షుడు వెంకటాద్రి, కార్యదర్శులు కమలాకర్, ఉమేష్, మేఘన, వర్దన్, తేజ, కవిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆలిండ్ కంపెనీలో అగ్ని ప్రమాదం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని అల్యూమినియం (ఆలిండ్) కంపెనీలో శనివారం సాయంత్రం మంటలు రేగాయి. కంపెనీ వెనుక భాగంలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు సరిహద్దు ప్రాంతంలో చెట్ల కొమ్మలు, ఆకులు, సినిమా సెట్టింగ్‌ల డంపింగ్‌లు ఉండగా.. మంటలు వ్యాపించడంతో కంపెనీ యాజమాన్యం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మాదాపూర్ ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పుతున్నారు. కంపెనీ వెనుక భాగంలో దట్టమైన పొగ వ్యాపించడంతో చుట్టు పక్కల ప్రాంతాల వారు ఆందోళనకు గురయ్యారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

మియాపూర్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రవీంద్ర పంజారి(40) చందానగర్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ భవనంలో కూలిపని చేస్తున్నాడు. ఈ క్రమంలో రవీంద్ర గత నెల 30వ తేదీ సొంతూరు అయిన మధ్యప్రదేశ్‌కు వెళ్తున్నానని చెప్పి మియాపూర్‌లోని దీప్తీశ్రీనగర్‌లో బస్ ఎక్కి వెళ్లాడు. అయితే స్వంత గ్రామానికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు రవీంద్ర కోసం పలుచోట్ల వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దీంతో ఆందోళన చెంది స్నేహితులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మరో ఘటనలో...

దీప్తీశ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న సదామ్ (37) స్థానికంగా బట్టలషాపులో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదిన ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి సాయంత్రం 6 గంటలకు ఇంటినుండి వెళ్లాడు. రాత్రి అయిన తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు సదామ్ కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన భార్య మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.